సాక్షి నిర్మల్

గురువారం । 9 । నవంబర్ । 2023



మితిమీరితే అంతే..

IIలో▸

ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రచారాన్ని ఉదయం 6తర్వాత ప్రారంభించి రాత్రి 10గంటల్లోపు ముగించాలి. ఆ తర్వాత బహిరంగ సభలు, ఊరేగింపులు నిర్వహించరాదు.



ఘనంగా రేడియోగ్రఫీ దినోత్సవం

నిర్మల్‌చైన్‌గేట్: ప్రపంచ రేడియోగ్రఫీ దినోత్సవాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రిలో బుధవారం నిర్వహించారు. సూపరింటెండెంట్ సునీల్ కేక్ కట్ చేశారు. రేడియాలజీ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
32.0 /21.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నాగాపూర్‌లో పరిశీలిస్తున్న సుధీర్‌కుమార్

పెంబి: మండల కేంద్రంతో పాటు నాగాపూర్, మందపల్లి, ఇటిక్యాల్, తాటిగూడ, పుల్గంపాండ్రి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను బుధవారం జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసిన పాఠశాలలో కరెంట్, ఫర్నిచర్, నీటివసతి, మూత్రశాలలు, తదితర సౌకర్యాలు పరిశీలించారు. ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు తదితరులున్నారు.

'అమరుల ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ పోరాడాలి'



మాట్లాడుతున్న నంది రామయ్య

ఖానాపూర్: అమరుల ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ పోరాడాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాత తర్లపాడ్ గ్రామంలో నిర్వహించిన అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడారు. దేశానికి నిజమైన స్వాతంత్ర్యం రాలేదని, ప్రజలు నేటికీ అనేక రకాల దోపిడీ, పీడనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంజేశారు. దోపిడీ పాలక వర్గాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమిస్తేనే అమరులకు నిజమైన నివాళి అర్పించినట్లని అభిప్రాయపడ్డారు. నాయకులు రాజన్న, మున్వర్, లక్ష్మణ్, మంతు, భగవంత్‌రావు, గోపాల్, నాగోరావు తదితరులున్నారు.

కేజీబీవీ సందర్శన



విద్యార్థినులతో మాట్లాడుతున్న పద్మ

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని కేజీబీవీని బుధవారం జిల్లా ఫైనాన్షియల్ అధికారి పద్మ సందర్శించారు. హాస్టల్ వసతి, భోజనాన్ని పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థినులతో మాట్లాడారు. ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తంజేశారు. ఆమె వెంట ఎస్వో అపర్ణ, అకౌంటెంట్ రాజ్యలక్ష్మి, పీఈటీ జయ, ఎస్ఆర్పీలున్నారు.

ప్రత్యేక తరగతులు పకడ్బందీగా నిర్వహించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

లక్ష్మణచాంద: పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. కేజీబీవీలో విద్యార్థినులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. వార్షిక పరీక్షలకు ప్రణాళికతో సన్నద్ధం కావాలని పదో తరగతి విద్యార్థినులకు సూచించారు. పదో తరగతి విద్యార్థినులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, చదువులో వెనుకబడినవారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు రాజేశ్‌నాయక్, ఎస్వో నవిత, సీఆర్పీ మహేందర్ తదితరులున్నారు.

అభ్యర్థుల గుణగణాలు చూడండి



కాగజ్‌నగర్ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన బీఆర్‌ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప

- బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే.. వాళ్లు అడిగినవి నెరవేరుస్తా
- కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్
- భారీగా తరలివచ్చిన జనం
- సభల సక్సెస్‌తో పార్టీ శ్రేణుల్లో జోష్

ఆసిఫాబాద్/కౌటాల/కాగజ్‌నగర్‌టౌన్/బెల్లంపల్లి: ఎన్నికల్లో నిలబడే అభ్యర్థుల గుణగణాలు చూసి.. సేవాతత్వం.. మంచీ.. చెడ్డా.. ఆలోచించి ఓటు వేయాలని బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. కుమురంభీం జిల్లా సిర్పూర్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే వాళ్లు అడిగినవన్నీ నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి పట్టణాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కుమురంభీం జిల్లా అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని.. జిల్లా అభివృద్ధి కోసం ఆరాటపడే కోనేరు కోనప్ప, కోవ లక్ష్మిని గెలిపించాలని ప్రజలను కోరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలిచిన వెంటనే వారు కోరిన విధంగా ఈ ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇక్కడి ప్రజలతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసంగం చివర ఉర్దూలో మాట్లాడి ఆకట్టుకున్నారు.

గెలిచే అభ్యర్థుల్లో కోనప్ప..

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచే అభ్యర్థుల్లో కోనేరు కోనప్ప నంబర్ 1గా ఉంటారని, ఆయన ఏనాడూ తన సొంత పనుల కోసం తన వద్దకు రాలేదని తెలిపారు. పేపర్ మిల్లు పునరుద్ధరణ కోసం ఎంత కష్టపడ్డారో నాకు తెలుసని, సర్‌సిల్క్ పరిశ్రమను తెరవాలని కేటీఆర్‌ను కలిసి సతాయిస్తున్నారని అన్నారు. కోనప్ప ఆధ్వర్యంలో ఇక్కడ పాత వైభవం, పరిశ్రమలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. సిర్పూర్‌లో బీఆర్‌ఎస్ బలంగా ఉందని, నంబర్ వన్ నియోజకవర్గంలో కోనేరు కోనప్ప అత్యధిక మెజార్టీతో గెలుస్తున్నారని తెలిపారు. మీపక్క నియోజకవర్గాలు బెల్లంపల్లి, ఆసిఫాబాద్‌లో బీఆర్‌ఎస్ గెలుపునకు సిర్పూర్ నాయకులు కృషి చేయాలని సూచించారు. అనంతరం కేసీఆర్ సమక్షంలో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య కుమారుడు విజయ్ బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

సక్కు సీటు త్యాగం చేశారు..

ఆసిఫాబాద్ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తన సీటును త్యాగం చేసి కోవ లక్ష్మికి ఇచ్చారని అన్నారు. సక్కుతోపాటు ఇటీవల పార్టీలో చేరిన మర్సుకోల సరస్వతికి రానున్న రోజుల్లో మంచి రాజకీయ భవిష్యత్ ఉంటుందని హామీ ఇచ్చారు. మాలీ కులస్తులకు నిధులు కేటాయించి, సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. సీఎం తన ప్రసంగంలో కాంగ్రెస్ పార్టీ నేతలపై నిప్పులు చెరుగుతూ.. 'ధరణి ఉండాలా..? వద్దా..?' అంటూ ప్రజలను కోరగా.. అందరూ ఉండాలి.. ఉండాలి.. అంటూ నినాదాలు చేయడం కనిపించింది. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లిలో జరిగిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలను పార్టీ శ్రేణులు విజయవంతం చేశాయి. సీఎం రాకతో గులాబీనేతల్లో ఉత్సాహం నిండింది. సభల్లో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత, సిర్పూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప, ఆసిఫాబాద్ అభ్యర్థి కోవ లక్ష్మి, బెల్లంపల్లి అభ్యర్థి దుర్గం చిన్నయ్య, చెన్నూర్ అభ్యర్థి బాల్క సుమన్, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎంపీ నగేశ్, మంచిర్యాల అభ్యర్థి ఎన్.దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు బోడ జనార్దన్, గడ్డం అరవిందరెడ్డి, రాష్ట్ర ఫిల్మ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పి.రాంమ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

గాబరా పడొద్దు

బెల్లంపల్లిలో ప్రసంగిస్తూ 'చిన్నయ్య నువ్వేం భయపడకు. పార్టీ మారేటోళ్లు గొర్రెల్లెక్క మారుతరు. ఎవడో ఒకడు అమ్ముడుపోతే గాబరాపడొద్దు. అసోంటోళ్లను చూసి భయపడాల్సిన అవసరం లేదు. నీకు ప్రజాబలం, ఆశీర్వాదం ఉంది. వాళ్లే నీకు శ్రీరామరక్ష. చెన్నూర్‌లో చెల్లని రూపాయి బెల్లంపల్లిలో చెల్తదా..? డబ్బుల కట్టలు తెచ్చుకుని దిగే వ్యక్తి చెన్నూర్‌లో ఐదుసార్లు పోటీ చేస్తే నాలుగుసార్లు ఓడించిండ్లు. అక్కడ తిరస్కరించిన వ్యక్తిని ఇక్కడెట్ల గెలిపిస్తరు..? రైతుబీమా, రైతుబంధు, రోజుకు 24గంటలు కరెంటు ఉండాలంటే చిన్నయ్య గెలవాలె.' అని కేసీఆర్ అన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా తెలంగాణ



సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

- ఇందిరమ్మ రాజ్య స్థాపనే లక్ష్యం
- ఉమ్మడి ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటాం
- ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలకు న్యాయం చేస్తాం
- బీఆర్‌ఎస్‌ను ఎండగడ్తూ.. బీజేపీకి ఓటు వేస్తే వృథా అంటూ..
- ఉట్నూర్, ఆదిలాబాద్ సభల్లో రేవంత్ ప్రచారం సాగిన తీరు

సాక్షి,ఆదిలాబాద్/ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్/ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ.. ఈ ఎన్నికల్లో ఆ సర్కార్‌ను ఓడించాలనే రీతిలో ఆదిలాబాద్ జిల్లాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం తీరు సాగింది. రెండు శాతం ఉన్న బీజేపీకి ఓటు వేస్తే వృథా అంటూ.. ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఇందిరమ్మ రాజ్యం వస్తేనే ప్రజల తెలంగాణ వస్తుందని నొక్కిచెబుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ఆవశ్యకతను వివరించారు. తాము అధికారంలోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్‌ను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామంటూ భరోసానిచ్చే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉట్నూర్, ఆదిలాబాద్‌లో బుధవారం నిర్వహించిన విజయభేరి సభల్లో ఆయన ప్రసంగించారు.

ఆదిలాబాద్, ఉట్నూర్‌లో సభలు..



ప్రసంగిస్తున్న రేవంత్‌రెడ్డి, పక్కన అభ్యర్థి బొజ్జు

కాంగ్రెస్ విజయభేరి సభలు ఉట్నూర్, ఆదిలాబాద్‌లో నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఉట్నూర్‌కు హెలీక్యాప్టర్‌లో చేరుకున్నారు. రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ ప్రకాశ్‌రాథోడ్, ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆర్టీసీ మైదానంలో ఏర్పాటు చేసిన సభ ప్రాంగణానికి చేరుకున్నారు. రేవంత్ తన ప్రసంగంలో.. డబ్బులు లేకపోయినా వెడ్మ బొజ్జుకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందని చెబుతూ.. రూ.కోట్లు ఉన్నోళ్లకే కాంగ్రెస్ టికెట్లు ఇచ్చిందని ఆరోపిస్తున్న బీఆర్‌ఎస్‌ను విమర్శించారు. ప్రజల వైపు నిలబడ్డ, ఓటర్ల మద్దతు ఉన్న బొజ్జును గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే రేఖానాయక్ బీఆర్‌ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ ఎన్నికలు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బినామీ అయిన ధనికునికి, నిరుపేద ఆదివాసీ బిడ్డకు మధ్య జరుగుతున్నవిగా కాంగ్రెస్ ఉట్నూర్ అభ్యర్థి వెడ్మ బొజ్జు అభివర్ణించారు. అనంతరం ఆదిలాబాద్‌లో నిర్వహించిన సభలో రేవంత్ పాల్గొన్నారు.

ఏజెన్సీ అంశాలపై ఫోకస్..

ఉట్నూర్ సభలో ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీ అంశాలపై రేవంత్ ఫోకస్ పెట్టారు. లంబాడాలు, ఆదివాసీలు తనకు రెండు కళ్ల లాంటి వారన్నారు. ఈ రెండు వర్గాల మధ్య ఉన్న పంచాయితీని తెంచుతామని చెప్పారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరుల భూములకు రక్షణ కల్పిస్తామని వివరించారు. పోడు భూములకు పట్టాలిచ్చి వాటిని అమ్ముకునే హక్కు కల్పిస్తామని గిరిజనులకు వివరించారు. 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నట్లు నిరూపిస్తే తాము నామినేషన్లు వేయమని చెప్పారు. లేనిపక్షంలో ఇంద్రవెల్లి అమరుల స్తూపం సాక్షిగా ముక్కు నేలకు రాస్తారా? అంటూ బీఆర్‌ఎస్‌ను ప్రశ్నించారు. కడెం ప్రాజెక్ట్‌ను కాంగ్రెస్ కడితే ఈ ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్వహణను చూసుకోలేకపోతుందంటూ తీవ్ర విమర్శలు చేశారు. ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలకు న్యాయం చేసే బాధ్యత తమదంటూ చెప్పుకొచ్చారు.

బలప్రదర్శనకు సిద్ధం

- నామినేషన్ల వేళ భారీ ర్యాలీలు
- పోటాపోటీగా జన సమీకరణ
- నేడు పలువురి నామినేషన్

నిర్మల్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ఘట్టంలో భాగంగా పార్టీలు బలప్రదర్శనకు సిద్ధమవుతున్నాయి. వేలాదిమందితో ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేసేందుకు జనసమీకరణ చేస్తున్నాయి. గురువారం సీఎం కేసీఆర్ నామినేషన్ వేస్తుండగా ఇదే ముహూర్తాన నామినేషన్లు వేసేందుకు చాలామంది బీఆర్‌ఎస్ అభ్యర్థులు సిద్ధమయ్యారు. జిల్లాలోనూ నిర్మల్, ముథోల్, ఖానాపూర్ అభ్యర్థులు అల్లోల, విఠల్‌రెడ్డి, జాన్సన్‌నాయక్ గురువారమే నామినేషన్ వేయనున్నారు. ఈనెల 10న నామినేషన్ల స్వీకరణ గడువు ముగియనుంది.

నేడు అల్లోల, జాన్సన్ తదితరులు..

బీఆర్‌ఎస్ నిర్మల్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి జిల్లాకేంద్రంలో గురువారం నామినేషన్ వేయనున్నారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల నుంచి వేలాదిగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఉదయం 10గంటల నుంచే మంత్రి భారీ ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందించనున్నారు. అలాగే ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్ గురువారం ఉట్నూర్‌లో నామినేషన్ వేయనున్నారు. సాదాసీదాగానే నామినేషన్ ప్రక్రియ ముగించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. బీజేపీ అభ్యర్థిగా రాథోడ్ రమేశ్ ఇప్పటికే ఒక సెట్ నామినేషన్ వేయగా, గురువారం మరిన్ని సెట్‌లు వేయనున్నారు.

చివరిరోజు బీజేపీ, కాంగ్రెస్

నిర్మల్ నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు మహేశ్వర్‌రెడ్డి, శ్రీహరిరావు ఇదివరకే ఒక్కో సెట్ నామినేషన్ వేశారు. చివరిరోజైన శుక్రవారం మిగతా సెట్ల నామినేషన్ పత్రాలు అందించనున్నారు. ఈ సందర్భంగా వారు కూడా భారీ ర్యాలీలకు ప్లాన్ చేసుకుంటున్నారు.

ముథోల్‌లో వాళ్లు తీస్తేనే వీళ్లు..

నిర్మల్‌తో పోలిస్తే ముథోల్ నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, అభ్యర్థుల ప్రణాళికలు కాస్త విరుద్ధంగా ఉంటాయి. ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డి గురువారం నామినేషన్ వేయనున్నారు. విఠల్‌రెడ్డి భారీ ర్యాలీ తీస్తేనే శుక్రవారం బీజేపీ అభ్యర్థి రామారావు పటేల్ అంతకుమించి ర్యాలీ తీయాలన్న యోచనలో ఉన్నట్లు తెలిసింది. మరోవైపు విఠల్‌రెడ్డి అనుచరులు శుక్రవారం రామారావుపటేల్ ర్యాలీ తీస్తున్నారా.. లేదా.. అని ఆరా తీస్తున్నారు. ఒకవేళ రామారావుపటేల్ భారీ ర్యాలీకి ప్లాన్ చేస్తే గురువారం బలప్రదర్శన చేయాల్సిందేనని భావిస్తున్నారు. ఇలా ఇక్కడ ఎదుటి పార్టీ తీసుకునే నిర్ణయాన్ని బట్టి మరోపార్టీ నామినేషన్‌లో బలప్రదర్శనకు ప్లాన్ చేసుకుంటున్నాయి. గత ఎన్నికల్లో ఇరువురు అభ్యర్థులు భారీర్యాలీతో వెళ్లి ముథోల్‌లో నామినేషన్లు వేశారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం



ఆర్వోకు నామినేషన్ పత్రాలు ఇస్తున్న స్వదేశ్



నామినేషన్ పత్రాలు ఇస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బొజ్జు



స్వతంత్ర అభ్యర్థి రాజు



డీఎస్పీ అభ్యర్థి రవీందర్

నిర్మల్‌చైన్‌గేట్/ముథోల్/ఉట్నూర్ రూరల్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ బుధవారం కొనసాగింది. నిర్మల్ నియోజకవర్గానికి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా పరికిపండ్ల స్వదేశ్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా రామారావు, స్వతంత్ర అభ్యర్థులుగా సుదర్శన్ నాయక్, దేవోళ్ల రాజు, పృథ్వీరాజ్ రిటర్నింగ్ అధికారి రత్న కళ్యాణికి నామినేషన్లు అందజేశారు. అలాగే ముథోల్ నియోజకవర్గానికి బుధవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి కోమల్‌రెడ్డి తెలిపారు. ఖానాపూర్ నియోజకవర్గానికి కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు, సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ అభ్యర్థి పెందూర్ ప్రియాంక నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారి ఎల్.జీవాకర్‌రెడ్డికి పేర్కొన్నారు. శుక్రవారం వరకు గడువు ఉన్నట్లు తెలిపారు.

ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల అబ్జర్వర్స్ గురువారం జిల్లాకు రానున్నందున అన్ని విభాగాల సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన జరగకుండా చూడాలని జిల్లా ఎన్నికలాధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. వివిధ అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల దష్ట్యా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ, మీడియా సెంటర్, కాల్ సెంటర్ ఇతర అన్ని విభాగాలను బుధవారం అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ వీడియోలు, టీవీల్లో ప్రసారమయ్యే ఇంటర్వ్యూలు, రాజకీయ పరమైన కార్యక్రమాలు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌లో 16 లొకేషన్లలో 32 కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా పౌర సంబంధాల అధికారి తిరుమల, ఈడీఎం నదీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఎన్నికల సిబ్బంది, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించారు. ప్రక్రియ పూర్తి చేసి స్క్రీన్ ద్వారా చూపించారు. నిర్మల్, ముదోల్, ఖానాపూర్ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించే 4,735 మందికి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని వివరించారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

గడువులోపు వసూలు చేయాలి

ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజు గడువులోపు వసూలు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల కమిషనర్లు, ఇంజినీర్లు, రెవెన్యూ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులతో సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరితహారం కోసం ఇప్పటినుంచే నర్సరీల్లో మొక్కలు పెంచాలని తెలిపారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు తనఖీ చేయాలన్నారు. అభివృద్ధి పనుల గురించి ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్‌స్టేషన్లలో అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు రాజు, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, డీఈలు సంతోష్, నాగేశ్వర్‌రావు, ఏఈలు హరిభువన్, తిరుపతి, మెప్మా పీడీ సుభాష్ తదితరులు హాజరయ్యారు.

ఫిర్యాదులొస్తున్నాయ్!

- సీ- విజిల్‌కు తొమ్మిది ఫిర్యాదులు
- టోల్ ఫ్రీ నంబర్ నుంచి మరో 411

నిర్మల్‌చైన్‌గేట్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే సామాన్య ప్రజలు కూడా ఫిర్యాదు చేసేలా సీ-విజిల్ యాప్‌తోపాటు, టోల్ ఫ్రీ నంబర్ 1950ని అందుబాటులో ఉంచింది. ఈ నంబర్ ద్వారా ప్రజలు తమ సందేహాలు నివృత్తి చేసుకునే, సూచనలు తెలిపే వీలుంది. ఇప్పటివరకు చాలామంది సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.

సీ-విజిల్‌కు తొమ్మిది..

జిల్లాలోని నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటివరకు సీ-విజిల్ యాప్ ద్వారా తొమ్మిది ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో ఎలాంటి ఆధారం లేని నాలుగింటిని తిరస్కరించగా.. ఐదుచోట్ల పరిష్కారం చూపించారు. సీ-విజిల్ యాప్‌తో వీడియో, ఆడియో, ఫొటోతో ఫిర్యాదు చేస్తే.. వెంటనే లొకేషన్ ఆధారంగా ఎఫ్ఎస్‌ఏ టీం అక్కడికి చేరుకుంటుంది. ఫిర్యాదు చేసిన వ్యక్తి వివరాలు ఎట్టి పరిస్థితుల్లో బయటకు రానివ్వరు.

1950 టోల్ ఫ్రీకి 411..

ఎలక్షన్ కమిషన్ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1950కి 411 ఫిర్యాదులు వచ్చాయి. ఎన్నికల నేపథ్యంలో ఈ సేవలు కలెక్టరేట్‌లో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఓటరు ఐడీ స్టేటస్, జాబితాలో పేరు వివరాలు, కనిపించకుండా పోయినా ఐడీ కార్డు తిరిగి తీసుకోవడం, ప్రాంతాలు మారితే ఓటర్ ఐడీ కార్డు పొందడం, ఫాం 6,7,8 అప్లికేషన్ విధానం తదితర వాటిపై ఫిర్యాదులు, సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

వేటిపై ఫిర్యాదు చేయవచ్చంటే..

సీ-విజిల్ యాప్‌లో పలు అంశాలపై ఫిర్యాదు చేయవచ్చు. మద్యం, డబ్బులు, బహుమతులు పంపిణీ చేసినా, బెదిరింపులకు పాల్పడినా, ఎన్నికల వ్యయం అధికంగా చేసినా, ఓటర్ల రవాణా, మత విద్వేషాలకు పాల్పడినా, రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, మరణాయుధాలతో సంచరించినా యాప్‌లో ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతారు.

సత్వర పరిష్కారం..

సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసిన గంటలోపు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల బృందం సంఘటనా స్థలానికి చేరుకుంటుంది. సమగ్ర విచారణ చేపట్టి నియోజకవర్గ పరిధి ఆర్వోకు నివేదిక ఇస్తుంది. ఫిర్యాదులో పేర్కొన్న విషయాలు నిజమని నిర్ధారిస్తే కేసు నమోదు చేసుకుని ఎలక్షన్ కమిషన్‌కు పంపిస్తారు. కాగా, సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే వారి వివరాలు, అడ్రస్ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు గోప్యంగా ఉంచుతారు.

యాప్ వినియోగం ఇలా..

సీ-విజిల్ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఫొటో, వీడియో అప్లోడ్ చేసే సమయంలో ఫోన్‌లో జీపీఆర్‌ఎస్‌ను ఆన్ చేసి ఉంచాలి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరిగినప్పుడు ఫొటో లేదా, వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆ వివరాలన్నీ నేరుగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు చేరుతాయి. ఆయన ఆ ఫిర్యాదులను అధికార బృందాలకు పంపి 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదు చేసిన వారికి అధికారులు తీసుకున్న చర్యల గురించి వివరాలు తెలియజేస్తారు. అలాగే వారి వివరాలు కూడా గోప్యంగా ఉంచుతారు.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో సీ-విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తున్నాం. వారు వంద నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుని ఫిర్యాదులు పరిశీలిస్తున్నారు. ఓట్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లా ప్రజలు సీ-విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

– మోహన్‌సింగ్, యాప్ నోడల్ అధికారి

క్లుప్తంగా

రాజస్థాన్‌లో ఆదివాసీ కళాబృందం ప్రదర్శన



కళారంగ్‌లో దుబార్‌పేట్ వాసుల నృత్యం

ఇచ్చోడ: రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ జిల్లాలో ఈ నెల 5 నుంచి 8 వరకు నిర్వహించిన కళారంగ్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ మండల పరిధిలోని దుబార్‌పేట్ గ్రామానికి చెందిన ఆదివాసి సకల కళా సంక్షేమ సంఘం సభ్యులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ ఇంత చక్కని అవకాశం ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆనంద్, లింగేశ్వర్, తిరుపతి, మారుతి, భీంరావు పాల్గొన్నారు.

దండారీ ఉత్సవాలు



నేరడిగొండ: నృత్యాలు చేస్తున్న గుస్సాడీలు

ఇచ్చోడ: మండలంలోని గుబ్బ గ్రామంలో బుధవారం దండారీ ఉత్సవాలు నిర్వహించారు. గ్రామదేవతలు పెర్సపేన్ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి గుస్సాడీ సంబురాలను ప్రారంభించారు. గ్రామపటేల్ ఇంటి ఎదుట ఈ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. డప్పుచప్పుళ్లు, సంప్రదాయ వాయిద్యాలకు గిరిజనలు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న గుస్సాడీ నృత్యాలు..

నేరడిగొండ: ఆదివాసీ గ్రామాల్లో దండారీ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి దండారీ బృందాలు వెళ్లి గుస్సాడీ నృత్యాలు ఆడుతున్నారు. దీంతో ఆత్మీయత, ఐక్యత, సోదరభావం పెరుగుతుంది. మనుషులే కాదు దేవతలతో కూడా భేటీ నిర్వహిస్తారు. బుధవారం యాపల్‌గూడ, మాధాపూర్, వాగ్దారి, గుత్పాల, గొందుగూడ తదితర గ్రామాల్లో నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ పటేళ్ల తదితరులు పాల్గొన్నారు.

దాబాల్లో మద్యం సీసాలు స్వాధీనం

గుడిహత్నూర్: అక్రమంగా విక్రయిస్తున్న మద్యం సీసాలను ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ రాజమౌళి మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఆయన వివరాల ప్రకారం.. తనిఖీల్లో భాగంగా సీతాగోంది వద్ద ఉన్న శర్మ దాబాలో సోదాలు నిర్వహించగా 20క్వార్టర్ల మద్యం సీసాలు లభ్యమయ్యాయి. వీటి విలువ రూ.3600 ఉంటుందని తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన దాబా యజమానికి ప్రదీప్‌శర్మపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజలు వేర్‌ఇట్ యాప్ ద్వారా క్యూర్ కోడ్‌ను స్కాన్ చేసి నకిలీ మద్యాన్ని గుర్తించవచ్చని, ఇలా గుర్తించిన మద్యం సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై లక్ష్మణ్ కుమార్, సిబ్బంది బాపురావ్, మహ్మద్ పాల్గొన్నారు.

మితిమీరితే అంతే..

- ప్రచారంలో శబ్ద పరిమితులపై నిబంధనలు
- ఉల్లంఘిస్తే నియమావళి ప్రకారం చర్యలు

నిర్మల్‌ఖిల్లా: ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఎన్నికల మైకులు డీజే సౌండ్ బాక్స్‌లతో కూడిన ప్రచార వాహనాలు గల్లీగల్లీలో, గ్రామీణ ప్రాంతాల్లో సందడి చేస్తున్నాయి. ఎక్కడ చూసినా ప్రచార సాధనాల మోత చెవుల్లో మారుమోగుతోంది. జానపద టచ్‌తో కూడిన ప్రత్యేక గీతాలు హోరెత్తిస్తున్నాయి. అభ్యర్థుల గుణగణాలతో పాటు, పార్టీలకు సంబంధించిన పాటలు నిరంతరం హోరెత్తిస్తున్నాయి. అయితే ఈ ప్రచార సాధనాల మోత సాధారణ ప్రజానీకానికి, విద్యాసంస్థలు, ప్రార్థన మందిరాల వద్ద ఇబ్బందులు కలిగించే అవకాశాలున్నాయి. అదేవిధంగా వైద్యశాలలు, న్యాయస్థానాల సమీపంలో, వ్యాపార సముదాయాలు, పారిశ్రామిక ప్రాంతాల వద్ద విపరీతమైన ధ్వనులతో పాటలను పెట్టడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ శబ్ద తీవ్రతపై కొన్ని నిబంధనలను నిర్ణయించింది. ఈసారి మితిమిరిన శబ్దంతో మైకులతో ఊదరగొడితే చర్యలు తీసుకునేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. అభ్యర్థులు, వారి తరఫున ప్రచారం చేసేవారు ఈ అంశాలపై జాగ్రత్త వహించాలి. ఏ ప్రాంతంలో ఎంత శబ్దంతో కూడిన ధ్వనులను వినియోగించాలో, ఎన్ని డెసిబుల్స్ మించకుండా ఉండాలో నిబంధనలను రూపొందించారు. దీని ప్రకారం డీజే ప్రచార సాధనాల ధ్వనిశబ్దం మితిమిరితే జరిమానాలతో పాటు జైలుశిక్ష పడే అవకాశం కూడా ఉందని అధికారులు అంటున్నారు.



సీఈవో తెలంగాణ పారదర్శకతను సూచించే చిత్రం


ప్రాంతం	గరిష్టశబ్దం (డెసిబెల్స్‌లలో)
1. నివాస సముదాయాలు	-45 నుంచి 55
2. హాస్పిటల్స్ విద్యాసంస్థలు న్యాయస్థానాలు	-40 నుంచి 50
3. వ్యాపార సముదాయాలు	-55 నుంచి 65
4. పారిశ్రామిక ప్రాంతాలు	-70 నుంచి 75

అనుమతి ఉంటేనే మైకుల మోత...

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు నిబంధనల మేరకే ప్రచారం నిర్వహించాలని ఎన్నికల నిబంధనలు వెల్లడిస్తున్నాయి. దీని ప్రకారం నాయకులు కార్యకర్తలు ఉదయం 6గంటల తర్వాత ప్రచారాన్ని ప్రారంభించి రాత్రి పది గంటలలోగా ముగించాలి. 10గంటలు దాటిన తర్వాత బహిరంగ సభలు, ఊరేగింపులు వంటివి నిర్వహిస్తే చర్యలు తీసుకుంటారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు చీరలు, చొక్కాలు ఇతర దుస్తులు క్రీడా పరికరాలు వాటి వస్తువులను పంపిణీ చేసి ఓటర్లను ప్రభావితం చేసేటట్లుగా ప్రయత్నించకూడదు. టోపీలు, కండువాలను మాత్రం వాడొచ్చు. వాటిని ఖర్చులు ఎన్నికల వ్యయంలో పొందుపరచాలి. అభ్యర్థులు ఎన్ని వాహనాలు ఉపయోగించుకుంటారో, దానికి ముందస్తు అనుమతిని రిటర్నింగ్ అధికారి నుంచి పొంది ఉండాలని నిబంధనలు తెలుపుతున్నాయి. ప్రచార వాహనాలు, మైక్ సెట్‌లు ముందస్తు అనుమతి మేరకే వినియోగించాలి. సమావేశం, ఊరేగింపు వంటి వాటి కార్యక్రమాల సమాచారం పోలీసులకు ముందస్తుగా అందించాలి. ఊరేగింపులు, సభలు, సమావేశాలు కొనసాగుతున్నప్పుడు వివిధ రకాల రాజకీయ పార్టీలు ఒకేమార్గంలో వెళ్తున్నప్పుడు ఒకే సమయంలో ఊరేగింపులు తీస్తున్నప్పుడు పోలీసులకు సహకరిస్తూ కార్యక్రమాలను పూర్తి చేసుకోవాలి. విపరీతమైన శబ్దాలు, టపాసులు, భారీ పేలుళ్ల వంటి పదార్థాలను వినియోగించకూడదు. రాజకీయ పక్షాల వారు ఒకరికి ఒకరు దూషణలు, వ్యక్తిగత విమర్శలు చేసుకోకుండా ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుంది.

ముధోల్ బరిలో అన్నదమ్ముళ్లు

- వేర్వేరు పార్టీల నుంచి పోటీ
- ఆసక్తిగా పరిశీలిస్తున్న ప్రజలు



పవార్ రామారావుపటేల్



నారాయణరావుపటేల్



మోహన్‌రావుపటేల్

భైంసా: భైంసా మండలం బడ్‌గాం గ్రామానికి చెందిన బోస్లే గోపాల్‌రావుపటేల్ - కమలాబాయి దంపతులకు ఇద్దరు కుమారులు. బోస్లే నారాయణరావుపటేల్, బోస్లే మోహన్‌రావుపటేల్. భైంసాలో జిన్నింగ్ ఫ్యాక్టరీ నడిపే ఇరువురు వ్యాపారాల్లో స్థిరపడ్డారు. 1994 ఎన్నికల్లో టీడీపీ నుంచి మొదటిసారి బరిలో దిగిన నారాయణరావుపటేల్ అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డెన్నపై గెలుపొందారు. అలాగే పవార్ శ్యాంరావుపటేల్ - రాధాబాయిల కుమారుడైన పవార్ రామారావుపటేల్ ఇద్దరికీ వరుసకు సోదరుడు. అక్కాచెల్లెల్ల పిల్లలైన ఈ ముగ్గురు కలిసి వ్యాపారం చేసేవారు. ఒకేచోట ఉన్న వీరు పరిస్థితులతో రాజకీయ పార్టీలు వేరై ప్రత్యర్థులుగా బరిలో నిలిచారు.

ఆసక్తికరంగా పోటీ..

ముధోల్ అసెంబ్లీ బరిలో ఇద్దరు అన్నదమ్ములు నిలిచారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పవార్ రామారావుపటేల్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బోస్లే నారాయణరావుపటేల్ పోటీ చేస్తున్నారు. 2018 ఎన్నికల్లోనూ ఇద్దరు అన్నదమ్ముళ్లు బరిలో నిలిచారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పవార్ రామారావుపటేల్, నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బోస్లే నారాయణరావుపటేల్‌లు బరిలో నిలిచారు. 2018 ఎన్నికల్లో బోస్లే నారాయణరావుపటేల్, బోస్లే మోహన్‌రావుపటేల్‌లు నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున ఓటర్ల వద్దకు ప్రచారానికి వెళ్లారు. 2023 ఎన్నికల్లో బోస్లే మోహన్‌రావుపటేల్ పవార్ రామారావుపటేల్‌కు మద్దతు తెలుపుతున్నారు.

ఒకప్పుడు ముగ్గురు ఒక్కటే...

1994 ఎన్నికల నుంచి 2009 ఎన్నికల వరకు ముగ్గురు అన్నదమ్ముళ్లు ఏకతాటిపైనే ఉండేవారు. 1994 ఎన్నికల్లో బోస్లే నారాయణరావుపటేల్ ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆ సమయంలో వ్యాపారాలు పవార్ రామారావుపటేల్, బోస్లే మోహన్‌రావుపటేల్ చూసుకునేవారు. ముగ్గురు అన్నదమ్ముళ్లు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోనే ఉండేవారు. గడిచిన పదేళ్లలో రాజకీయ వైరుధ్యాలతో వేర్వేరుగా పోటీచేస్తున్నారు. అన్నదమ్ముళ్లే ఒకరిపై ఒకరు సవాల్ విసురుకుంటున్నారు. ఈ ఎన్నికల్లోనూ ఇరువురు సోదరులు రెండు జాతీయ పార్టీల నుంచి పోటీచేస్తున్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న డైరెక్టర్ వైజీ ప్రసాద్



పత్తిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

- కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ డైరెక్టర్ వైజీ ప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చని నాగ్‌పూర్ కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ డైరెక్టర్ వైజీ ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం కిసాన్ మేళా నిర్వహించారు. అధిక సాంద్రత పత్తి సాగు విధానంపై మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగుతో గులాబీ రంగు పురుగు ఉధృతి తగ్గుతుందని తెలిపారు. రానున్న కాలంలో ఎక్కువ మంది రైతులు ఈ సాగుకు మొగ్గు చూపాలని సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ డైరెక్టర్ సుధారాణి, కాటన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వీఎల్ వాగ్మారే, శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధి కారి పుల్లయ్య, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు శ్రీధర్ చౌహన్, రాంప్రసాద్, మురళి, మధుసూదన్‌రావు, కేవీకే కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

కాంగ్రెస్ మాజీ నాయకుల అరెస్ట్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార సభకు హాజరైన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని అడ్డుకునేందుకు యత్నించిన కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మైనార్టీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. కంది శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే టికెట్‌ను కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ రేవంత్‌రెడ్డి కాన్వాయ్ వచ్చే మార్గంలోని పట్టణంలో గాంధీపార్కు వద్ద పలువురు మైనార్టీ నాయకులు నిరసన తెలిపేందుకు యత్నించారు. ముందుగానే గుర్తించిన పోలీసులు వారిని అరెస్ట్ చేసి మావల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసులు

గంజాయి ముఠా అరెస్టు

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) ఎక్స్‌రోడ్డు వద్ద గంజాయి విక్రయిస్తున్న ముఠాను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని చించోలి(బి) ఎక్స్‌రోడ్డు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు విచారించగా మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన బస్వంతే అనిల్, తొంబారే గౌతం అలియాస్ ఉత్తంలుగా గుర్తించారు. వారివద్ద గల బ్యాగులను తనిఖీ చేయగా 10కిలోల గంజాయి లభ్యమైంది. చంద్రాపూర్‌లో తమకు తక్కువ ధరకు గంజాయి లభ్యమవుతుందని, దానిని ఎక్కువ ధరకు నిర్మల్, హైదరాబాద్‌లలో విక్రయించడానికి తీసుకొచ్చామని అంగీకరించడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో నిర్మల్ రూరల్ ఇన్‌చార్జి సీఐ పురుషోత్తంచారి, సారంగాపూర్ ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, సిబ్బంది గౌస్, మనోజ్, జంగు, ఆకాష్ ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

కబడ్డీ పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ

భైంసా: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌కు బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ యూనివర్సిటీ, ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్ సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నాయి. ఎంపికైన విద్యార్థులను ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ బుధవారం అభినందించారు. విద్యార్థులకు యూనివర్సిటీ తరఫున పూర్తిస్థాయిలో ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు. కబడ్డీ పోటీలకు వెళ్లే విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు, వసరులు, ఆటవస్తువులు అన్నింటినీ సమకూరుస్తామని పేర్కొన్నారు. సౌత్‌జోన్ పోటీల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు.

నిపాని యువకుడికి గోల్డ్‌మెడల్

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన నడికట్ల అవినాష్ బుధవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ పతకాన్ని అందుకున్నాడు. నల్గొండ జిల్లాలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఎంఏ ఎకనామిక్స్ ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ మూడవ స్నాతకోత్సవంలో భాగంగా యూనివర్సిటీల్లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్, ఓయూ మాజీ వీసీ రామలింగం చేతుల మీదుగా గోల్డ్‌మెడల్‌తో పాటు ప్రశంసపత్రం ప్రదానం చేశారు. అవినాష్‌ను గ్రామస్తులు, మిత్రులు అభినందించారు.



బంగారు పతకంతో అవినాష్

‘కంది’, ‘పాయల్’ కోటీశ్వరులు

- పోలీసు కేసులు కూడా..
- జోగు రామన్న ఆస్తులు రూ.64లక్షలే
- పోలీసు కేసులు నిల్
- ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు కంది శ్రీనివాస్‌రెడ్డి, పాయల్ శంకర్‌లు కోటీశ్వరులే. తమ ఆస్తులను కోటి రూపాయలకు పైగా ఉన్నట్లుగా ఎన్నికల అధికారికి అందజేసిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వారితో పాటు వారి భార్యల పేరిట కూడా కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నట్లుగా అఫిడవిట్‌లో వివరించారు. ఆస్తులతో పాటు బ్యాంకు రుణాలు సైతం కలిగి ఉన్నట్లుగా తెలిపారు. అలాగే పోలీస్ కేసులు సైతం తమపై ఉన్నట్లుగా అఫిడవిట్‌లో వెల్లడించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే జోగు రామన్న ఆస్తుల విలువ మాత్రం రూ.64లక్షలు మాత్రమే ఉన్నట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపారు. తనపై ఎలాంటి పోలీసు కేసులు లేవని వివరించారు. ఆ వివరాలను పరిశీలిస్తే....

కంది శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి



ఆదాయం : 2006–07లో తన ఆదాయం రూ.1,70,248గా చూపించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తన ఆదాయాన్ని ఇన్‌కంటాక్స్‌లో చూపించలేదు. తన భార్య కంది సాయిమౌన రెడ్డి ఆదాయాన్ని 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ. 2,85,000, 2019–20లో రూ.5,54,010లుగా చూపించారు. కాగా అప్పటి నుంచి 2023–24 వరకు ఆదాయాన్ని చూపించలేదు.

కేసులు: తనపై 7 క్రిమినల్ కేసులు ఉన్నట్లుగా పేర్కొన్నారు. ఒక సీఆర్‌ఎల్‌పీ కేసు ఉందని అఫిడవిట్‌లో నమోదు చేశారు.

నగదు: తన చేతిలో రూ. 3,45,000, తన భార్య చేతిలో రూ. 2,35,000లు నగదు ఉన్నట్లు పేర్కొన్నారు. తన వద్ద రూ. 10,40,000ల విలువ గల 162 గ్రాములు బంగారం ఆభరణాలు, భార్య వద్ద రూ. 78,60,000విలువ గల 1278 గ్రాముల బంగారం ఆభరణాలు ఉన్నట్లు అఫిడవిట్‌లో వివరించారు. పైన పేర్కొన్న వాటితో కలిపి వివిధ బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లు, బాండ్లు, షేర్ల రూపంలో తన పేరిట మొత్తం రూ. 8,98,76,833లు ఉన్నట్లు తెలిపారు. తన భార్య పేరిట రూ.27,51,15,289 ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఎలాంటి వ్యవసాయ భూములు లేవని, రూ.12,10,76,432 విలువ గల కమర్షియల్ బంగ్లాలు, రెసిడెన్షియల్ బంగ్లాలు తన పేరిట ఉన్నట్లుగా అఫిడవిట్‌లో తెలిపారు. తన భార్య పేరుపై రూ.2,28,00,000లుగా ఉన్నట్లు తెలిపారు.

రుణాలు: వివిధ బ్యాంకుల్లో తన పేరిటి రూ.4,96,85,258 రుణాలు ఉన్నట్లుగా ఆయన ఎన్నికల అధికారికి సమర్పించిన అఫిడవిట్‌లో వివరించారు.

జోగు రామన్న, ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి



ఆదాయం: 2022–23కు తన ఆదాయాన్ని రూ.9,80,700గా చూపించారు. తన భార్య ఆదాయాన్ని రూ.9,65,332 గా చూపించారు.

కేసులు: తనపై ఎలాంటి కేసులు లేవని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

నగదు: తన చేతిలో రూ.2లక్షలు ఉన్నట్లుగా తెలిపారు. తన పేరిట రూ. 22లక్షల విలువైన ఇన్నోవా కారు, రూ.6లక్షల విలువైన 10తులాల బంగారం ఉన్నట్లుగా పేర్కొన్నారు. పైవాటితో కలిపి వివిధ బ్యాంకు అకౌంట్లలో డిపాజిట్‌లు కలిపి రూ. 64,67,289 ఉందని పేర్కొన్నారు. తన భార్య చేతిలో రూ.1,50,000 తన భార్య పేరిట రూ.30లక్షల విలువైన 50తులాల బంగారం ఉందని పేర్కొన్నారు. పైవాటి విలువలతో కలిపి తన భార్య పేరిట వివిధ బ్యాంకుల్లో డిపాజిట్లు, పాలసీలు కలిపి రూ. 37,79,687 ఉన్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర, కమర్షియల్ బంగ్లాలు, భవనాలు కలిపి తన పేరిట రూ. 17,00,000 విలువగల ఆస్తులు, వ్యవసాయ, వ్యవసాయేతర, కమర్షియల్ బంగ్లాలు, భవనాలు కలిపి తన భార్య పేరటి రూ.69,00,000 విలువ గల ఆస్తులు ఉన్నట్లు తెలిపారు.

వ్యవసాయ రుణాలు

తన పేరిట : రూ.1,68,805,

భార్య పేరిట :రూ. 1,53,383

పాయల్ శంకర్, బీజేపీ అభ్యర్థి



ఆదాయం: 2022–24కు తన ఆదాయం: రూ. 8,42,980, తన భార్య ఆదాయం రూ.7,86,320, కుమారుడి ఆదాయం రూ.: 7,88, 830 భాగస్వామ్య ఆదాయం : 2,45,800గా అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

కేసులు: తనపై పోలీసు కేసులు 11 ఉన్నట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపారు.

ఆస్తులు: తన చేతిలో నగదు, వాహనము ఆభరణాలు, వివిధ పాలసీలు కలిపి రూ.1,12,03,753, తన భార్య చేతిలో నగదు, వాహనం ఆభరణాలు, వివిధ పాలసీలు కలిపి రూ.81,58,167గా తన కుమారుడు నగదు, వాహనం ఆభరణాలు, వివిధ పాలసీలు కలిపి రూ.1,65,03,811 ఉన్నట్లుగా తెలిపారు. తన భాగస్వామి వద్ద నగదు, వాహనం ఆభరణాలు, వివిధ పాలసీలు కలిపి రూ.16,91,722 ఉన్నట్లుగా తెలిపారు.

రుణాలు..

తన పేరిట రూ. 88,72,939

తన భార్య పేరిట రూ. 80,12,719

తన కుమారుడు రూ.1,11,33,360

వివాహితను వేధించిన ముగ్గురిపై కేసు

ఇంద్రవెల్లి:వివాహితను వేధించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన ఓ వివాహిత (30) తమ బంధువులుంటున్న అందర్‌బంద్ గ్రామానికి వెళ్లడానికి ఆదిలాబాద్ బస్టాండ్‌కు వచ్చింది. అక్కడి నుంచి ఇంద్రవెల్లి మండలంలోని దుర్వగూడ గ్రామానికి చెందిన పుసం హరిక్రిష్ణ, దుర్వ కాంతులతో పాటు మల్లాపూర్ గ్రామానికి చెందిన పుసం సుభాష్‌లు వివాహితను బలవంతంగా ఆటోలో ఎక్కించి ఇంద్రవెల్లి మండలానికి తీసుకొస్తూ అసభ్యకరంగా ప్రవర్తించి లొంగదీసుకునేందుకు యత్నించాడు. ప్రతిఘటించడంతో ఆటో నుంచి తోసేశారు. దీంతో వివాహిత కుడికాలుకు గాయమైంది. బుధవారం బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి ఆత్మహత్య

బోథ్: మండలంలోని నిగిని గ్రామానికి చెందిన కాత్లే జైవంత్‌రావ్(40) బుధవారం ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై రాము వివరాల ప్రకారం... జైవంత్‌రావ్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో ఇంట్లోని పురుగుల మందు తాగాడు. తాను పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కిరాణంలో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కిరాణంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పట్టణ ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ వివరాల ప్రకారం... పట్టణంలోని ప్రియదర్శినినగర్ నుంచి బస్టాండ్ వెళ్లే మార్గంలోని కిరాణ షట్టర్‌ను పగలగొట్టి లోపలకు చొరబడిన దొంగలు నగదు అపహరించారు. సీసీటీవీ ఫుటేజీ నమోదు చేసే రెండు డీవీఆర్‌లను ఎత్తుకెళ్లారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపాడు.

వీరతిలకం.. ఆశీర్వచనం





ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసేముందు ఒక్కొక్కరు ఒక్కొ సెంటిమెంట్ పాటిస్తారు. దాన్ని నమ్ముకుంటే గెలుస్తామని వారి విశ్వాసం. ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి జోగు రామన్న నామినేషన్‌కు బయలుదేరే ముందు సాయిబాబా మందిరంలో పూజలు చేసిన అనంతరం సతీమణి జోగు రామ వీర తిలకం దిద్ది పంపించారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్ రెడ్డి తన తల్లిదండ్రుల ఆశీర్వదం తీసుకుని నామినేషన్ వేసేందుకు బయలుదేరారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్